నిచ్చెన మెట్లయంత్రాంగంలో, పై మెట్టుకు కిందిమెట్టును ఆదుకోవాలని వున్నంత మాత్రాన, ఆచరణలో సాధ్యం కాదు. మధ్యనున్న మెట్లకీ ఆ ఆలోచన వుండాలి కదా!

# ఓడిపోయాను

—ఘండికోట బ్రహ్మాజీరావు

జీవితంలో చాలసార్లు నేను ఓడిపోయాను. అందుచేత ఓటమి అంటే నేను విచారించను. కానీ....

సరిగ్గా పది గంటలకు కుర్చీలో కూర్చున్నాను. చాల పనుంది. మూడువేల టియేజర్నల్సు–సాయంకాలం వరకు పని చేసినా ముగియని పని.

"సార్! ఎవరో అసిస్టెంటు మిమ్మల్ని కలుస్తానంటున్నాడు." అన్నాడు చప్రాసీ.

"ఇవాళ చాలా పనుంది. రేపు రమ్మను."

"చాలా అర్జంటుగా మిమ్మల్ని కలవాలట– అతని పేరు ధర్మారావని, కిందటి సంవత్సరం రైలు ప్రమాదంలో దెబ్బతిన్నాడని మీకు చెప్పమన్నాడు."

ధర్మారావు కోసం అన్ని పనులు వెనకబెట్టాను. కిందటి సంవత్సరం రెండు రైళ్లు ఒకదానితో ఒకటి అభిముఖంగా గుద్దుకున్నాయి. ధర్మారావు పని చేస్తున్న ట్రెయిను స్టేషనులో నిలబడి వుంది. డ్రైవరు స్టేషను మాస్టరు దగ్గిరికి వెళ్ళాడు. ధర్మారావు యింజను మీద వున్నాడు. ఎదురుగా వస్తున్న ఎక్స్‌ప్రెస్, పక్కలైను మీద నుంచి పోకుండా, తన రైలు వున్న లైను మీదికి రావడం చూసి, తొందరగా ఇంజను నుండి దిగిపోడానికి ప్రయత్నించాడు. కానీ, ఆఖరి క్షణంలో ఇంజన్లు రెండూ గుద్దుకొని, అతను ఇరవై గజాల దూరానికి పోయి పడ్డాడు. అప్పడతని ముఖం పచ్చడయింది. పళ్లన్నీ రాలిపోయాయి. పై పెదవీ, ముక్కులో కొంతభాగం తెగిపోయాయి. కింగ్ జార్జి హాస్పిటల్‌లోని సర్జనులు మూడు గంటలు ఆపరేషనుచేసి అతనిని బలికించారు. అతనక్కడ మూడు నెలలున్నాడు, మరో మూడు నెలలు రైల్వే హాస్పిటలులో వున్నాడు. మరో మూడు నెలలు ఇంట్లో వుండి ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు. ఏదో రికార్డు అసిస్టెంటుగా షెడ్‌లో వేసి జీతమిస్తున్నాం.

"ధర్మారావ్! వెంటనే తీసుకురా!"


ధర్మారావు నమస్కారం చేశాడు.

"ఎలాఉన్నావ్? ధర్మారావ్!" అడిగాను.

"బాగానే ఉన్నానుసార్!"

"మరి ఏమిటి ఇబ్బంది?"

"సార్! మీకు తెలుసు, నేను ఆరు నెలలయి స్పెషలిస్టు దగ్గిర ట్రీట్ మెంటు తీసుకుంటున్నట్టు. నేను మందుల కింద వెయ్యి రూపాయిలవరకు చేతి సొమ్ము ఖర్చు పెట్టాను. మందుల రసీదులు జతపరిచి, ఆ సొమ్ము యిప్పించమని రెండు నెలల కింద అప్లికేషను పెట్టుకున్నాను."



# హైకూలు



నీకోసం నాకోసం
దీపావళి తయారు చేస్తున్నారు
శివకాశి కుర్రాళ్ళు

సగం కాలి ఆరిపోయింది
కాకర పువ్వొత్తి
మర్నాడొచ్చే ముష్టి కుర్రోడి కోసం

ఇదెక్కడి రాలుగాయి పిల్లలు
రాత్రి అమావాస్యని
పొలిమేరల్లోంచి తరిమేసారు

కాకర పువ్వొత్తిచ్చాను
మురికి చారికల కుర్రోడు
మతాబులా వెలిగాడు

గుంపులో చెదరిన
సీమ టపాకాయలకి
మర్నాడు గుడిసెలో దీపావళి

— వెంకటరావు C.I

"అవును. వెంటనే బిల్లు చేయమని ఆ రోజే సెక్షన్‌కి పంపించాను. డబ్బింకా దొరకలేదా?"

'లేదుసార్.'

"గుమస్తా రామారావుగారిని కలిసి నేను పంపించినట్టు చెప్ప"

"వారం రోజులై చెప్తున్నానుసార్!"

"అతనిని పిలుచుకురా!"

"అతనీ రోజు సెలవు పెట్టారు."

"మరి..."

"అతను నా అప్లికేషను, రసీదులు కనిపించలేదంటున్నారు."

"అయితే?"

"అవిపోతే నా వెయ్యి రూపాయిలు పోయినట్టే.."

"అదెలా అవుతుంది?"

"మళ్ళీ రసీదుల డూప్లికేట్లు సంపాదించాలి. డాక్టర్ల సంతకాలు. తతంగ మంతా మొదలుపెడితే మరో ఆరు నెలలు పడుతుంది."

నేనాలోచిస్తున్నాను, ఏం చెయ్యడమని.

"సార్! నా దగ్గిర డబ్బులేకపోతే ఒకతని దగ్గిర అప్పుడూ అప్పుడూ అప్ప చేస్తూ వచ్చాను. అలా ఆ అప్ప రెండు వేలవరకూ పెరిగింది. కనీసం ఒక అయిదు వందలైనా యీ సాయంకాలానికి ఇవ్వకపోతే అతను ఒప్పుకోన న్నాడు. నా ట్రీట్‌మెంటుకి ఇంట్లోని పాత్ర సామాన్లు సైతం అమ్మివేశాను. అతనికి ఈ అయిదు వందలూ యిస్తే మళ్ళీ సహాయం చేస్తాడు."

"చాల యిబ్బంది వచ్చి పడిందే! అతనో వారం రోజులు వుండలేడా?"

"నాలుగు వారాలయి అతన్ని తిప్పుతున్నాను. ఈసారి యివ్వకపోతే అతను."

"ధర్మారావ్... కొంచెం ఆగు. ఆలోచించనీ!"

"ఏదో చేసి నాకు సాయంకాలానికి డబ్బు ముట్టే ఏర్పాటుచేయండిసార్!"

ఆలోచించడానికి ఏమీలేదు. నేను స్వయంగా ఒక సెక్షనులో కూర్చుంటే పని అవుతుందేమో!

అన్నిటికన్న ముందు మెడికల్ రసీదులు, అప్లికేషను పైకి తియ్యాలి.

అనుకున్నట్టే ఆఫీసు సూపరింటెండెంట్ గుమస్తా వచ్చే దాకా ఆగమ న్నాడు. మరునాడు సెలవు. తరువాత ఆదివారం.

"మీ దగ్గిర రామారావుగారి డ్రాయరు తాళం, డూప్లికేటు వుంటుంది. పదండి ఒకసారి తీసి చూద్దాం"

"ఆ పని బాగుండదుసార్!"

"ఎమర్జన్సీకే తెరచినట్టు వ్రాయండి. నేను సంతకం పెడతాను"

ఏ సంతకం అక్కరలేకుండానే డ్రాయరు తెరచుకుంది.

కాగితాలతో అది నిండిపోయింది. కాగితం తరువాత కాగితం, కేసు తరువాత కేసు తీస్తే, చిట్టచివరకు ధర్మారావు అప్లికేషను, రసీదులు బయటపడ్డాయి.

అక్కడితో పనికాలేదు.

ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్య తనీ బిల్లు చెయ్యలేనన్నాడు. నాకు బాగా తెలిసిన మరో గుమస్తా ముందుకొచ్చాడు.

బిల్లు తయారయేసరికి పన్నెండున్నర.

దానిని మామూలు పద్ధతిలో అకౌంట్సుకి పంపుతే మరునాటి మధ్యాహ్నం అందుతుంది.

కేసునేనే పట్టుకొని అకౌంట్సుకి వెళ్లాను. బిల్లులు చూస్తున్న సీనియర్ గుమస్తా నవ్వుతూ పలకరించాడు. అతని పక్కనే కుర్చీలో కూర్చున్నాను.

ధర్మారావు కేసు అతని చేతిలో పెట్టాను. అతను జాగ్రత్తగా దానిని చూశాడు.

"అంత అర్జంటా?" అని అతనడిగాడు.

"పాపం! ఈ ధర్మారావు చాలాయిబ్బందిలో వున్నాడు."

"అయితే రెండు గంటలకి ఎవరినైనా పంపండి"

ఆ మధ్యాహ్నం నేను లంచ్‌కి పోలేదు. ధర్మారావు బిల్లు వస్తే వెంటనే చెల్లించమని కాషియరుకు ఫోనుచేస్తూ ఉండిపోయాను.

రెండు గంటలకు ధర్మారావుతో నేనే వెళ్లాను. మూడు గంటలకు బిల్లు తెచ్చి ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్యకు స్వయంగా యిచ్చి, బంట్రోతుతో కాషియరుకు బిల్లు పంపించి, సాయంకాలం అయిదులోగా పేమెంటు చేయించమని నొక్కి చెప్పాను.

"అదెంత పనిసార్! మీరింక నిశ్చింతగా వెళ్ళిపోవచ్చు. అంతా నేను చూసు కుంటాను" అభయమిచ్చాడు ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్య.

ధర్మారావుతో చెప్పి నా సీటుకు వచ్చాను.

అప్పటికి మూడు గంటలయింది.

ఏదో మంచి పని చేశానని ఆనందిస్తూ, రాత్రి తొమ్మిది వరకూ కూర్చుండి సంతకాలు పూర్తి చేశాను.

ఒక వారం రోజుల్లో నాకు ఖర్గపూర్ బదిలీ అయింది. మరి ధర్మారావుని వెంటనే కలియలేకపోయాను.

* * *

ఖర్గపూర్‌లో రైలు పెట్టెలు పునర్నిర్మించే శాఖకు అధికారిగా వుండేవాడిని. మూడు వేల మంది నాకింద పనిచేసేవారు. మంచి హోదా, అధికారం చేతిలో వుండేవి.

ఒక రోజు లంచ్‌కి బయలుదేరుతుంటే, ఆఫీసు వరండాలో రంగారావు కలిశాడు. అతను పెయింట్ షాపులో పనిచేస్తున్నాడు. అతను పాలిష్‌చేసిన దానిమీద ముఖం చూసుకోవచ్చు. మంచి పనివాడు. అతనికో అవార్డు కూడా ఇప్పించాను.

"ఏం రంగారావు?" అతని నమస్కారం స్వీకరించి అడిగాను.

"సార్! మరో ఆరు నెలలలో నేను రిటైరవుతున్నాను — ఈ సంగతి

మీకు తెలుసు-"

"అవునవును"

"మా అబ్బాయి మా షాపులోనే పనిచేస్తున్నాడు. ఆరు నెలలబట్టి ఇంటద్దె వాడు పుచ్చుకోవడం లేదు."

"ఆహా!"

"దయచేసి నేనుంటున్న ఇల్లు వాడిపేర బదిలీ చేస్తే..."

"మధ్యాహ్నం రా! సీనియర్ గుమస్తా ఉత్తమ శీలన్‌తో చెప్పి కేసు నాకు పంపించమను."

"అతనితో చెప్తాను... కాని అతనో అడ్డు పెడుతున్నాడు సార్!"

"ఏమిటది?"

"యూనియన్ మెంబర్లు ఆ ఇంటి కోసం ప్రయత్నిస్తున్నారని, అందుచేత దొరకదని చెప్పాడు సార్!"

"మరో ఇల్లయితే?"

"ఈ ఇల్లు లైను చివరనుంది - చాలా ఖాళీ స్థలముంది. నేనో చిన్న గది వేసుకుంటే అందరం ఒక ఇంట్లోనే వుండవచ్చు."

"సరే! రేపు యూనియన్ మెంబర్లతో మీటింగుంది. వాళ్ళతో చెప్పాను - ఎల్లుండి మళ్ళీ కలియవలసింది..."

మరునాడు యూనియన్ మెంబర్లతో మాట్లాడాను. అందులో ఒకాయన ఆ ఇంటి కోసం ప్రయత్నిస్తున్నాడు. అంతకన్న మంచి ఇల్లు మరొకటి అత నికిచ్చి, రంగారావు ఇంటికి అభ్యంతరాలు లేవని వాళ్ళ చేత సంతకాలు పెట్టించాను.

నేను ఛార్జి తీసుకున్నప్పుడు తన గుమస్తాలను పరిచయం చేశాడు ఆఫీసు సూపరింటెండెంటు. అప్పుడు మొదటిసారి ఇళ్ళు ఇచ్చే గుమస్తాను కలిశాను.

"నా పేరు ఉత్తమ శీలన్ సార్! సీనియర్ క్లర్కుని"

ఆ పేరు వింటే ఎవరో చెంప మీద కొట్టినట్టయింది. ఈ నేతి బీరకాయ ఎవరని నిదానించి చూశాను-

"నేను రూల్సు ప్రకారం పోతాను సార్? అందుకే చాలామంది పనివాళ్ళకి నేనంటే కోపం"

నేనతని మాటలు విని నవ్వాను - మరేం జవాబు చెప్పలేదు.

ఉత్తమశీలన్ చాలా మెల్లగా మాట్లాడేవాడు. వినయంతో వ్యవహరించే వాడు. ఆఫీసు పని చాలా చక్కగా చేసేవాడు. అతని గురించి నాకున్న అనుమానాలను తొలగించాడు.

రంగారావు అనుకున్నట్టే మరునాడు వచ్చాడు. సీనియర్ గుమస్తా కేసు పట్టుకువచ్చాడు.

"ఉత్తమ శీలన్?"

"ఎస్. సార్!"

"రంగారావు ఇంటిని అతని కొడుకు పేర బదిలీ చేస్తూ ఆర్డర్లు తయా రుచేయండి. యూనియన్ మెంబర్ల ఆమోదం వుంది. రూల్సు కూడా ఒప్పుకుంటాయి.

"కేసు మరోసారి చూడనివ్వండి సార్!"


"నేను చెప్తున్నాను కదా! ఆర్డర్లు తయారుచెయ్యండి. నేను సంతకం చేస్తాను. ఎవరేనా ఇంకా ప్రశ్నిస్తే, రంగారావు చాలా గొప్ప పనివాడనీ, అతని సేవలకు యాజమాన్యం చాలా ఋణపడి వుందనీ నేను రాస్తాను"

అతను మరేం జవాబు చెప్పలేదు.

నాకు వాగన్లు బాగుచేసే శాఖకు బదిలీ అయింది. వెళ్లిపోయే ముందు రంగారావు ఇంటి బదిలీ ఆర్డర్లు సంతకం చేసి మరీ కదిలాను.

ఇది మరో విజయం - విజయం అనడంకన్నా ఒక మంచి కళాకారుడికి ఉపకారం చేశానన్న సంతోషం...

* * *




ఒక రోజు విశాఖపట్నం స్టేషన్లో ధర్మారావు కనిపించాడు. నాకో నమ స్కారం పారేసి తన దారిని వెళ్ళిపోతున్నాడు. ఆ రోజుల్లో శ్రమపడి డబ్బు ఇప్పించిన సంగతి ఇంత వేగంగా మరచిపోయినందుకు నాకు విచారం కలి గింది. అతని డబ్బు అతనికి ఇప్పించడంలో గొప్పేముంది?

"ధర్మారావు! ఇలారా!"

వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.

అతనిని ఏమని అడగాలి?

"నీ ఆరోగ్యం బాగుందా?"

"బాగుంది సార్?"

"అన్నట్టు ఆ రోజు సాయంకాలం నీకు డబ్బు ముట్టిందా?"

అతను నసుగుతూ అన్నాడు, " ముట్టింది సార్!"

"వెంకట్రామయ్య మాట కొట్టేయకుండా..."

"అదేనుసార్!"

అతను మనసులో వున్నదేదో చెప్పలేకపోతున్నాడు.

"నా దగ్గిర నీకు దాపరికం దేనికి?"

"ఏం చెప్పడం - వాళ్ళింటికి రాత్రి గెస్టులు వస్తున్నారని, పరుగెత్తి రెండు కిలోల కోడి మాంసం ఇంట్లో ఇచ్చినట్టు టెలిఫోన్ వచ్చే దాకా బిల్లు కాషియర్ దగ్గిరకు పోదన్నాడు."

ధర్మారావుకి ఆ విధంగా డబ్బు ముట్టింది....

రంగారావు ఒకనాడు బజారులో కనిపించాడు. నన్ను చూసీ చూడనట్టు వెళ్ళిపోతున్నాడు.

"రంగారావ్!" నేనే పిలిచాను.

అతను రిటైరయ్యాడు - స్వతంత్రుడు - కనీసం నమస్కారం కూడా చెయ్యలేదు.

"ఏమయింది, అంత కోపంగా వున్నావ్?"

"మా వంటి వాళ్ళకు కోపముంటే ఏం ప్రయోజనం - మీరందరూ నాకు ఇల్లు ఉచితంగా ఇచ్చినట్టు సంబరపడ్డారు."

"మరి..."

"ఆ ఉత్తమశీలన్ ఎదాన మూడు వేల రూపాయిలు కొట్టిన తరువాత ఆర్డర్లు నా చేతికి వచ్చాయని మీకు తెలుసా?"

నాకు తెలియదు.

వెంకట్రామయ్యలు, ఉత్తమ శీలన్లు లోకంలో ఉన్నంత కాలం గెలుపొం దడం జరగదు.

వాళ్ళ ముందు నేను చిత్తుగా ఓడిపోయాను.